

ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ భాగస్వామ్యంతో ఓటు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ ఓటు విలువను గుర్తించాలని, ఏ ప్రలోభాలకూ లోను కాకుండా తమ ఓటును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఓటు వేయడం తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి మెడికల్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న ముఖ్యఅతిథిగా పాల్గొంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తాము ఓటు వేయడమే కాక ఇంట్లో అందరూ ఓటు వేసేలాగా చూడాలని, రాజమండ్రిలో ఈసారి నూరు శాతం పోలింగ్ ను సాధించాలని పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా గామన్ నిర్వహణ

57-58 పిల్లర్ మధ్య పాడైన బేరింగ్

వంతెనకు ఇరువైపులా యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి నదిపై కోల్‌కతా-చెన్నయ్ హైవేను కలుపుతూ ఏర్పాటైన గామన్ వంతెన నిర్వహణా లోపం అధికార యంత్రాంగం చిత్తశుద్ధికి దర్పణం పడుతోంది. తాజాగా వైబ్రేషన్స్ ఘటన వంతెన నాణ్యతలో డొల్లతనాన్ని ఎత్తిచూపింది. గోదావరి నదిపై 5.06 కిలో మీటర్ల పొడవున 81 పిల్లర్లలతో ఈ వంతెనను నిర్మించారు. తాజాగా 57-58 పిల్లర్ కింద ఏర్పాటు చేసిన బేరింగ్ మరమ్మతుకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. పిల్లర్లకు 500 మీటర్ల వరకూ ఇసుక తవ్వకాలు చేపట్టకూడదనే నిబంధన ఇక్కడ ఆచరణలో అమలుకు నోచుకోవట్లేదు. గామన్ బ్రిడ్జికి ఇరువైపులా యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతోంది. అయినప్పటికీ అధికారులు నోరు మెదపట్లేదు. ఇసుక డ్రెడ్జింగ్ కారణంగానే పిల్లర్ కుంగి బేరింగ్‌లు జారిపోయాయనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.



గోదావరి నదిపై నిర్మించిన గామన్ బ్రిడ్జి, బేరింగ్‌లు పాడవ్వడంతో 57-58 స్పాన్ మధ్య వచ్చిన ఖాళీ

రివర్ గోదావరి బ్రిడ్జి లిమిటెడ్ (గామన్ ఇండియా లిమిటెడ్) సంస్థ 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోలో రూ.512 కోట్ల అంచనాలతో ప్రారంభమైన ఈ వంతెన 36 నెలల కాల వ్యవధి అనగా 2012 జూన్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. సకాలంలో పూర్తికాకపోవడంతో అంచనా వ్యయాన్ని రూ.808 కోట్లకు పెంచి ఎట్టకేలకు 2015 అక్టోబరు నాటికి పూర్తి చేశారు. కోల్‌కత్తా నుంచి చెన్నయ్‌ను కలిపే ఈ హైవేపై నిత్యం వేలాది వాహనాల రాకపోలు జరుగుతుంటాయి. ప్రకాష్ అస్ఫాల్ట్ టోల్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వంతెన నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తుంది. గతంలో వంతెనపై రోడ్డు కుంగిపోయి రాకపోకలు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ఆ సమయంలోనూ నిర్వహణా సంస్థ పట్టించుకోలేదు. ఈ సమయంలో రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆందోళన సైతం చేపట్టారు. తాజా ఘటనతో నిర్వహణా లోపాలు మరోసారి బయట పడ్డాయి.



వంతెన సమీపంలో డ్రెడ్జింగ్ చేసిన ఇసుక స్టాక్ పాయింట్

వంతెన సమీపంలోనే డ్రెడ్జింగ్

గామన్ వంతెన సమీపంలో యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతోంది. అధికార పార్టీ అండదండలతో ఓ వ్యక్తి ఇసుక డ్రెడ్జింగ్ కాంట్రాక్టు తీసుకున్నాడు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కల్గిన యంత్రాలతో నదిలోని ఇసుకను తోడి స్టాక్ పాయింట్‌లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, చెన్నయ్ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో వంతెన సమీపంలోనూ ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. పిల్లర్ కుంగిపోయిన సమయంలోనూ బ్రిడ్జి కింద ఇసుక డ్రెడ్జింగ్‌ను మాత్రం ఆపలేదు.

తాజా ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి



గామన్ బ్రిడ్జి పిల్లర్ కుంగిపోవడంపై సమగ్ర విచారణ జరిపించాలి. 8 బేరింగులు పోయినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. బ్రిడ్జి నిర్వహణపై పర్యవేక్షణ బాధ్యత ఎందుకు కొరవడింది.? అత్యాధునిక యంత్రాలతో నదిలో డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్నారు. పిల్లర్‌లకు 500 మీటర్ల వరకూ ఇసుక తవ్వకాలు జరపకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవటంలేదు. తక్షణమే నదిలో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలి. అఖిల పక్ష పార్టీలను తీసుకెళ్లి తాజా ఘటనపై స్పష్టత ఇవ్వాలి.

- టి. అరుణ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి

బిజెపి అనపర్తి అభ్యర్థిగా కృష్ణంరాజు

టిడిపిలో భగ్గుమన్న మంటలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అనపర్తి మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మొండి చేయి చూపించారు. బిజెపి అనపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ఎం.శివరామకృష్ణంరాజును బుధవారం ప్రకటించింది. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ములగపాటి శివరామకృష్ణంరాజు బిజెపి అనపర్తి అసెంబ్లీ కన్వీనర్‌గా బాధ్యతలను నిర్వరిస్తున్నారు. బిజెపికి ఈ నియోజకవర్గంలో కనీస పునాది లేదు. అయినప్పటికీ బిజెపి పట్టుపట్టి ఈ సీటు సాధించటంపై టిడిపిలో ఆందోళన వ్యక్తమవుతోంది. తాజా నిర్ణయంతో ఈ నియోజకవర్గంలో బిజెపికి టిడిపి కార్యకర్తల నుంచి సహకారం ఎండమావేనని స్పష్టమవుతోంది. టిడిపి, జనసేన, బిజెపితో పొత్తు అధికార పార్టీ అభ్యర్థి సత్తి సూర్యనారాయణరెడ్డి గెలుపు అవకాశాలను సుగమం చేసిందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు స్థానంతో పాటు ఒక అసెంబ్లీ స్థానం ఇవ్వాలంటూ బిజెపి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. టిడిపి తొలి జాబితాలో నల్లమిల్లికి చోటు దక్కిన విషయం విదితమే. నల్లమిల్లి అనుచరులకు ఈ సంతోషం కేవలం రోజుల వ్యవధిలోనే ఆవిరైంది. అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికే కేటాయించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా టిడిపి శ్రేణులు ఆందోళనలు, రాజీనామాలు చేసినప్పటికీ అధినేత వెనకడుగు వేయలేదు. బిజెపి పార్లమెంటు అభ్యర్థి పురంధేశ్వరి గెలుపునకు అనపర్తి సీటు కీలకమంటూ నల్లమిల్లి అనుచరులు విజ్ఞాపన పత్రాలు అందజేసినా బిజెపి వెనక్కి తగ్గలేదు. రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన రామకృష్ణారెడ్డి వైసిపి ప్రభుత్వం నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొని తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు.



శివరామకృష్ణంరాజు

2014 ఎన్నిల్లో టిడిపి నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 1,373 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2019లోనూ వైసిపి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డికి గట్టిపోటీ ఇచ్చారు. గడిచిన రెండుసార్లు ఇద్దరు అభ్యర్థులూ పోటాపోటీగా తలపడ్డారు. 2024 ఎన్నికల్లోనూ వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని అందరూ భావించారు. అధికార పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత టిడిపి అభ్యర్థికి కలిసివచ్చే అవకాశాలను సైతం టిడిపి వదులుకుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. టిడిపి, జనసేన కూటమి తొలి జాబితా ప్రకటించే నాటికి బిజెపితో పొత్తు లేదు. బిజెపి పెద్దలు రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం సీట్లు ఆశించారు. జిల్లాలో టిడిపికి బలమైన కేంద్రాలను ఈ ఎన్నికల పొత్తులో భాగంగా జనసేనకోసం నిడదవోలు, రాజానగరంతో పాటు తాజాగా బిజెపి కోసం అనపర్తి సీటు వదులుకోవడంపై ఆ పార్టీ కార్యకర్తలే విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేశారు. మరి కొంతమంది అదే బాటలో పయనించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి ఇంటి వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి - బిక్కవోలు

అనపర్తిలో టిడిపి మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద బుధవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పొత్తులో భాగంగా అనపర్తి నియోజకవర్గం సీటును బిజెపికి కేటాయించారు. ఈ నేపథ్యంలో నల్లమిల్లి అనుచరులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రామకృష్ణారెడ్డి ఇంటికి చేరుకున్నారు. నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి టిక్కెట్టు కేటాయించాలని నినదించారు. ఇద్దరు కార్యకర్తలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. తోటి నాయకులు వారిని సముదాయించారు. నల్లమిల్లి స్వయంగా వచ్చి వారికి నచ్చజెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడరాదన్నారు. గురువారం కార్యకర్తలతో సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకుందామని ఆయన కార్యకర్తలకు సూచించారు.



కార్యకర్తలను సముదాయిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బాలికల వసతిగృహంలో తనిఖీలు

ప్రజాశక్తి-పెరవలి

మండలం పెరవలి కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర సూచించారు. బుధవారం పెరవలి కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిని బాలికల వసతి గృహాన్ని డాక్టర్ వసుంధర తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికల పోషకాహారంపై శ్రద్ధ చూపించాలన్నారు. రక్తహీనత కలిగిన బాలికలకు ప్రాజెక్టు ఐరన్ ప్లస్‌లో భాగంగా ఐరన్ మాత్రలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మునగాకు, కారంపొడి ప్రతిరోజూ పిల్లలకు అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా రక్తహీనత అధికమించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.హేమరాజు, డిపిఎస్ జగదీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.35 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజానగరం

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో సుమా రిఫైనరీస్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.35 లక్షల ఆస్తినష్టం చోటుచేసుకుంది. రిఫైనరీస్‌లో 40 టన్నుల సామర్థ్యం ఉన్న ముడి ఆయిల్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టారుదీ పనుల్లో భాగంగా అయిల్ ట్యాంకు పైభాగంగా వెల్డింగ్ పనులు చేస్తున్నారు. నిప్పురవ్వలు ఆయిల్ ట్యాంకులో పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే రాజమహేంద్రవరానికి చెందిన అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పి.సుబ్బారావు ఆధ్వర్యంలో రెండు, అనపర్తి నుంచి ఒక ఫైరింజన్ వచ్చి నాలుగు గంటలు శ్రమించి మంటలను ఆర్పాయి. ఈ ప్రమాదంలో 20 టన్నుల పామాయిల్ ముడి సరుకు అగ్నికి ఆహుతైంది. దీని విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుందని అగ్నిమాపక అధికారి తెలిపారు. రూ.13 లక్షల యంత్ర సామగ్రి కాలిపోయిందన్నారు. సిబ్బందికి ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు.



పామాయిల్ ఫ్యాక్టరీలో చెలరేగుతున్న మంటలు



ఎన్‌టిఆర్ విగ్రహానికి తొలగిన ముసుగు

కోడ్ ఉన్నా అమలు సున్నా..

ప్రజాశక్తి -దేవరపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిర్వహణలో అధికారులు అలసత్వం కనిపిస్తోంది. దేవరపల్లి స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎన్నికల కోడ్ సంబంధించి వేసిన ముసుగు గత రాత్రి నుంచి తొలగిపోయింది. ఆయనా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

వెంకన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరప్పాడులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వేలివెన్ను గ్రూపు టెంపుల్స్‌లో బుధవారం హుండీలు లెక్కింపు చేపట్టారు. 30 రోజులకు రూ.3,03,184 నగదు, 39 గ్రాముల వెండి వచ్చినట్టు దేవస్థానం కార్యనిర్వణ అధికారి ఎం.రాధాకృష్ణ తెలిపారు. ఇఒ పివి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో గ్రామస్తులు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై సిఇసి సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం వెలగపూడి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్లు ఏప్రిల్ 18 నుంచి ఏడు రోజుల పాటు స్వీకరించి, తదుపరి ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధం అవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ మేరకు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాల్సిన పనులను, శిక్షణా కార్యక్రమాలను పూర్తి చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫారం-7 ఫారం 8ల పరిష్కారం, నామినేషన్ ప్రక్రియ ముగిసే రోజులవరకు ఫారం 6 స్వీకరణ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముందుగా ప్రిసైడింగ్ అధికారి (పిఒ), ఎపిఒ, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహణ కోసం అనువైన ప్రాంతాన్ని గుర్తించి, అక్కడ తాగునీరు, విద్యుత్, తరగతి గదుల్లో ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయోలేదో వ్యక్తిగతంగా తనిఖీ చెయ్యాలని, నివేదిక అందజేయాలని ఆదేశించారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ గుర్తింపు, ఇవిఎంల కమిషనింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, అక్కడ విధులను నిర్వర్తించడం కోసం అధికారులు, సిబ్బందికి చెందిన రూట్ ప్రోగ్రాం సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా ఎన్నికల విధులు బాధ్యతలు సంభందించి నిర్దేశిత ఫారం పూర్తి చెయ్యడంపై పిపిటి పంపనున్నట్లు తెలిపారు. ప్రతీ శిక్షణ కార్యక్రమంలో ఆర్ఒ మాస్టర్ ట్రైనర్ శిక్షణ కార్యక్రమం పరిశీలించి, ఎన్నికల సిబ్బందిని ముఖ్యమైన సూచనలు తెలియజేయాలన్నారు. ఆబ్సెంట్ ఓటర్లను గుర్తించడం, రికార్డుల పరిశీలన బిఎల్ఒల వారీగా ఒక క్రమ పద్ధతిలో నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు ఫారం 12 డి అందజేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు అనుమతుల జారీని వేగవంతం చేయడంలో భాగంగా తాత్కాలిక పార్టీ ఆఫీసులు కోసం అనుమతులు కోరే క్రమంలో పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో లేకుండా ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తరువాతే అనుమతించాల్సి ఉంటుందనీ కలెక్టర్ చెప్పారు. సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదును సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ ను పటిష్టంగా అమలు పరచడంపై వివిధ తనిఖీ బృందాల విధుల్లో జవాబుదారీతనం, ఖచ్చితత్వం కలిగి ఉండడం చాలా ముఖ్యం అన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు సిబ్బందికి ఇతర అనుబంధ ఎన్నికల విధుల్లో బాధ్యతలు చేపట్టే వారికి పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాజమండ్రి రూరల్ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, అర్బన్ ఆర్ఒ, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్ఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, రాజానగరం ఆర్ఒ ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్ఒ, ఒఎన్‌జిసి ఎస్‌డిసి కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి.రమణా నాయక్, అనపర్తి ఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఆర్ఒలు

నిబంధనలను ఉల్లంఘించారని ఫిర్యాదు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ఉల్లంఘించారంటూ కమిషన్ ఏర్పాటు చేసిన సి విజిల్ యాప్ ద్వారా మండలంలో ఒక ఫిర్యాదు నమోదయిందని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురవయ్య తెలిపారు. ఈ మేరకు తుపాకులగూడెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వైసిపి రంగులు ఉన్నాయని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వ్యతిరేకించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ లక్ష్మితో కలిసి భవనాన్ని సందర్శించి భవన రంగు తెలుపు రంగుగా మార్చారు.



ఆర్‌కె కేంద్రానికి రంగులు మారుస్తున్న సిబ్బంది

కార్టూ'నిజం'



అధికారంలోకి ఇచ్చాక మా సారు

ఏం చేయడం లేదంటావేమయ్యా..?

రోజుకు రెండు పనులు చేస్తూంటేనూ..!!

నిపుణులతో గామన్ వంతెన పరిశీలన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, కొవ్వూరు రూరల్

కలెక్టర్ మాధవీలత సాంకేతిక నిపుణులతో కలిసి బుధవారం గామన్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంతెనకు సంబంధించి 57-58 స్పాన్ వద్ద పిల్లర్‌కు చెందిన బేరింగ్స్ దెబ్బ తిన్నట్టు గుర్తించారన్నారు. ఎక్కువ స్థాయిలో కుదుపులు (వైబ్రేషన్స్) వస్తున్నట్లు వంతెన నిర్వహణ చేపట్టిన ఏజెన్సీ, ఆర్‌జిబిఎల్ సాంకేతిక నిపుణులు బేరింగ్ మరమ్మతులకు సంబంధించిన పనులు చేపట్టాలని నివేదిక అందజేశారని పేర్కొన్నారు. వంతెన మార్గంలో ప్రయాణించే వాహనాలు, వాటి బరువు తదితర సాంకేతికపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఏ రకమైన బేరింగ్ ఏర్పాటు చెయ్యాలో అంచనా వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు సంభందిత అవసరమైనా బేరింగ్ నమూనా అంచనా వేసినట్టు తెలిపారు. ఆ బేరింగ్ తయారు చేసే సంస్థను కూడా పూనే, భోపాల్‌లో గుర్తించామన్నారు. ఆ మేరకు బేరింగ్ తయారు చేసేందుకు ఆర్డర్స్ కూడా వచ్చినట్టు చెప్పారు. వాటి తయారీకి 10 రోజులు, ఏర్పాటు చేసేందుకు 5 రోజుల వ్యవధి పడుతుందని ఇంజినీర్స్ వెల్లడించారని తెలిపారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో పనులు పూర్తి చేసేందుకు, అవరమైన పక్షంలో విమానం ద్వారా ఇక్కడికి బేరింగ్ తీసుకుని రావడం కోసం కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే అక్కడికి ఇంజనీర్లను పంపామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాజమండ్రీ నుంచి కొవ్వూరు వొచ్చే గామన్ వంతెన మార్గంలో ఒక వైపు మాత్రమే ట్రాఫిక్ మళ్లింపు చేయనున్న దృష్ట్యా ట్రాఫిక్ సమస్య రాకుండా పోలీస్, రవాణా, టోల్ ప్లాజా ఏజెన్సీ, రెవెన్యూ అధికారులు అధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కలెక్టర్ వెంట రాజమండ్రీ గోదావరి బ్రిడ్జి లిమిటెడ్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎహెచ్ ఖురేషీ, నేషనల్ హైవే ఇఇ సురేంద్ర బాబు, ఇఇ ఆర్‌డిసి ఎ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్

పదో తరగతి పరీక్షల ముగింపు


జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

తాళ్లపూడి మండలంలో 81 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయ్యారని ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ తెలిపారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 734 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేయగా 653 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. **చాగల్లు** మండలంలో మూడు సెంటర్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 443 విద్యార్థులు మంది హాజరు కావాల్సి ఉండగా 390 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒలు వి.ఖాదర్ బాబు, సిహెచ్.సుధాకర్ తెలిపారు. చాగల్లు జెడ్‌పి హైస్కూల్ సెంటర్‌కు ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చిన తనిఖీ చేసినట్టు ఎంఇఒ ఖాదర్ బాబు తెలిపారు. **దేవరపల్లి** పదో తరగతి పరీక్షలు ముగిశాయని, గురువారం హెచ్ అండ్ ఎఫ్‌టి పరీక్షలు, శనివారం ఒకేషనల్ పరీక్షలు ఉంటాయని ఎంఇఒలు మాణిక్యం తిరుమల దాసు, కెఆర్‌ఎస్‌విపి.అప్పారావు తెలిపారు. **గోపాలపురం** మండలంలో 10 పరీక్షలు ముగిశాయని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, మహేశ్వరరావు తెలిపారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో చివరి రోజు సోషల్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేట్ కలిసి 1,008 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయవలసి ఉండగా 864 పరీక్ష రాసినట్లు తెలిపారు. 144 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు.



గోపాలపురంలో విద్యార్థులు



నియామకపు పత్రాన్ని అందుకున్న దాసరి

ఎస్‌సి సెల్ ఛైర్మన్‌గా కుటుంబరావు

ప్రజాశక్తి-గోపాలపురం

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ ఛైర్మన్‌గా గోపాలపురం పెద్దగూడెంకు చెందిన దాసరి కుటుంబరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్‌సి సెల్ ఛైర్మన్ సాకే శంకర్ ఉత్తర్వులను జారీ చేశారని కుటుంబరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని ఎస్సీలను చైతన్యపరిచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. పిసిసి ఛీఫ్ వైఎస్.షర్మిళ, సీనియర్ నాయకులు. గిడుగు రుద్రరాజు, సాకే శంకర్, కొప్పుల రాజు, అరిగెల అరుణ, సుంకర పద్మశ్రీలకు కుటుంబరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎన్నికల కోలాహలం

- అంతటా సందడే సందడి
- వ్యూహ, ప్రతి వ్యూహాల్లో నేతలు
- గెలుపే లక్ష్యంగా పార్టీలు సన్నాహాలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపిస్తుంది. వాడవాడలా, వీధివీధినా కోలాహలం నెలకొంది. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో గెలుపే లక్ష్యంగా పార్టీలు పావులు కదుపుతున్నాయి. వచ్చే నెల18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 25 వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన జరుగుతాయి. 29 వరకూ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 6తో ముగియనుంది. మరో 20 రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో అన్ని పార్టీల్లోనూ హడావిడి మొదలైంది. ఇప్పటికే అధికార, విపక్ష కూటమిలు అభ్యర్థులను ఖరారు చేశారు. బరిలో నిలుచునేది ఎవరనేది తేలిపోయింది. ఈ నేపథ్యంలో పోటీలో ఉండే వారంతా ఇప్పటికే ప్రచారాన్ని మొదలుపెట్టేశారు. అధికార పార్టీ అభ్యర్థులు అయితే ప్రచారంలో ఒక అడుగు ముందే ఉన్నారు. ఓ పక్క ఎండలు మండిపోతున్నా రాజకీయ నాయకుల హడావుడితో ఎన్నికల కోలాహలం కనిపిస్తుంది. పల్లె, పట్టణాల్లో ఎక్కడ చూసినా రాజకీయ సందడి నెలకొంది.

వ్యూహాలు, సన్నాహాలు

సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తమ వ్యూహాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాయి. అందుకు అనుగుణంగా సన్నాహాలు చేస్తున్నారు. అధినేతలు ప్రచార షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తుండడంతో ఈ నెల 30న నియోజకవర్గానికి రానున్నారు. మూడు రోజులపాటు ముఖ్య నాయకులతో భేటీ కానున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాలకు ఇక్కడ నుంచే ఆయన పర్యటించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. వైసిపి నుంచి బరిలో ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతున్నారు. మీ ఆడపడుచుగా, స్థానికురాలిగా సేవలు అందిస్తానని చెప్పుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ పోటీతో వైసిపి పిఠాపురంపై ప్రత్యేక ఫోకస్‌ను పెట్టింది. ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టి వ్యవహరిస్తుంది. మిధున్ రెడ్డి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, మాజీమంత్రి కురసాల కన్నబాబు, మంత్రి దాడిశెట్టి రాజా, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వంటి నాయకులను ఇక్కడ వ్యూహకర్తలుగా వ్యవహరిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. తునిలో దాడిశెట్టి రాజా కుటుంబం, అటు యనమల రామకృష్ణుడు సహా అభ్యర్థి యనమల దివ్య తమదైన శైలిలో ప్రచారంలో పాల్గొంటున్నారు. వరుపుల రాజా మృతితో టిక్కెట్ దక్కించుకున్న ఆయన సతీమణి సత్యప్రభ సానుభూతి ద్వారా గట్టెక్కాలని ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమంటూ ముందుకు వెళుతున్నారు. ఈ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంఎల్‌ఎని కాదని వరుపుల సుబ్బారావుకు సీటు కేటాయించడంతో ఆయన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాకినాడ రూరల్‌లో కురసాల కన్నబాబు ప్రత్యేకంగా కరప మండలంపై ఫోకస్ పెట్టారు. ఆ మండలంలో ఓటర్లను తమ వైపుకు తిప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. వైసిపి వైఫల్యాలను వివరిస్తూ జనసేనకు ఓటు వేసి గెలిపించాలంటూ పంతం నానాజీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాకినాడ సిటీలో ద్వారంపూడి మరోసారి పాగా వేయాలని భావిస్తున్నారు. అన్ని వర్గాలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇటీవల మూడవ జాబితాలో సీటు కన్ఫర్మ్ అవ్వడంతో మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు ప్రచారాన్ని ప్రారంభించారు. మూడోసారి హ్యాట్రిక్ సాధించాలనే తపనతో ఉన్న చినరాజప్ప ప్రచారంలో కాస్త వెనకబడి ఉన్నారు. టిడిపిలో ఉన్న వర్గపోరు కారణంగా ఆయన పూర్తిస్థాయిలో ప్రచారాన్ని చేయలేకపోతున్నారు. వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అటు జగ్గంపేటలో తోట నరసింహం కుటుంబం ముమ్మరంగా ప్రచార పర్వంలో ఉన్నారు. జ్యోతుల నెహ్రూ సహా, కూటమిలో టికెట్ దక్కక గుర్రుగా ఉన్న పాఠం శెట్టి సూర్యచంద్ర ప్రచారంలో పాల్గొంటున్నారు. కాకినాడ పార్లమెంటు బరిలో వైసిపి నుంచి పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ అన్ని నియోజకవర్గాల్లోనూ ముఖ్య నాయకులతో భేటీ అవుతున్నారు. టైట్ షెడ్యూల్ వేసుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. కూటమి అభ్యర్థి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ముఖ్య నాయకులను కలుస్తున్నారు. ప్రచారాన్ని ఇంకా ప్రారంభించలేదు. పవన్ కళ్యాణ్ పిఠాపురం వచ్చిన తర్వాత ఆయన ప్రారంభించే అవకాశం ఉంది. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ సందడి నెలకొనడంతో కాకినాడ జిల్లాలో రాజకీయాలు మరింత వేడెక్కాయి.

సందడే సందడి

ఏ నలుగురు కలుసుకున్నా ఎన్నికల ముచ్చట్లపైనే చర్చించుకుంటున్నారు. అభ్యర్థులు, వారి బంధువులు, స్నేహితులు, ఇతర కుటుంబ సభ్యులు ఎన్నికల పనిలోనే ఉన్నారు. ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ ఎవరెవరి మద్దతు ఉంటుందనేది అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో వైసిపి 151 స్థానాల్లో విజయం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 స్థానాలకు 14 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి కూడా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే పనిలో నిమగ్నమైంది.

నేరాలు ఘోరాలు

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గోపవరం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న పోసిపోయిన ప్రసాద్‌ను అరెస్టు చేశామని సిఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని వారు కుమార్ హెచ్చరించారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

బ్రాహ్మణగూడెం గ్రామంలో బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లే ఇజ్రాయేలు (73) మృతి చెందాడని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. ఇజ్రాయేలు బైకుపై వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి బైకుపై వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇజ్రాయేలుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

123 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకూరు పంచాయతీ శివారు మొల్లేటి మొగ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఓలేటి గంగాద్రి నుంచి 123 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరావు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. ఆయన వెంట స్టేషను సిబ్బంది మణికంఠ స్వామి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో జగనన్న కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న గృహానికి పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ బుధవారం దుర్మరణం చెందాడు. రంగంపేట మండలం ముందవరం గ్రామానికి చెందిన ముప్పిడి బులివీర్రాజు (31) పని చేస్తుండా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో పాలంగి చెక్ పోస్ట్ వద్ద 11 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఉండ్రాజవరం ఎస్ఐ. వి.అప్పలరాజు తెలిపిన వివరాల మేరకు బుధవారం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఉండ్రాజవరం వైపు ఇరువురు వ్యక్తులు నడిచి వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. సుమారు 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాకినాడ నుంచి గంజాయిని తీసుకొచ్చి, మండలంలోని పలు ప్రాంతాల్లో అమ్ముకునేందుకు వచ్చినట్లు వారు విచారణలో తెలిపారు. నిందితులు కేరళకు చెందిన పి.రాజీవ్‌రవి, కె.సుల్ఫికర్‌గా గుర్తించారు. రెండు సెల్ ఫోన్లు, రూ.300 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్యామ్ సుందర్

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ

ప్రజాశక్తి-తాళ్లపూడి

వేసవిలో ప్రజలకు చల్లని మంచినీరు అందించడం అభినందనీయమని తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్‌సుందర్ అన్నారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో న్యూ యువ శక్తి ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు రజిని కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రయాణికులకు ఈ చలివేంద్రంలో ప్రతిరోజు చల్లని మంచినీరు వారంలో ఒకరోజు మజ్జిగ తదితర చల్లని పానీయాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఆటో యూనియన్ సభ్యులు మంగరాజు, వీరబాబు, దాస్, ప్రతాప్, రాయుడు, ఏడుకొండలు, శ్రీను, మోషే తదితరులు ఉన్నారు.

తిరుమలాయపాలెంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి జగ్గంపేట నియోజవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించాలని ఆయన కోడలు లక్ష్మీదేవి, మనవడు అనీష్ నెహ్రూ మండలంలోని తిరుమలాయపాలెంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి మానిఫెస్టోను ప్రజలకు వివరించారు.



స్పోర్ట్ మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు

దేశాభివృద్ధిలో యువత ఓటు కీలకం

ప్రజాశక్తి-గోపాలపురం

బలమైన ప్రజాస్వామ్యానికి, దేశ అభివృద్ధికి యువత ఓటు చాలా కీలమని కొండవీటి విద్యాసంస్థల సెక్రెటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం, నెహ్రు యువ కేంద్రం సభ్యులు అన్నారు. బుధవారం గోపాలపురం శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో భారతీయ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ దూలం కిషోర్ ఆదేశాల మేరకు ఓటర్ ఎవేర్‌నెస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. నారీ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సంపత్ కుమార్, స్టాఫ్, నేషనల్ యూత్ వాలంటరీ పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తాడితోటలో ఎంపీ భరత్ ప్రచారం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమండ్రి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ఎంపీ, వైసిపి నగర అభ్యర్థి మార్గాని భరత్ అన్నారు. బుధవారం నగరంలోని తాడితోట, మహాత్మా గాంధీ కాంప్లెక్స్‌లో ప్రచారం నిర్వహించారు. వార్డు సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చందన నాగేశ్వర్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, అడపా శ్రీహరి, రావిపాటి రామచంద్రరావు, బొమ్మన జయకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు

ప్రజాశక్తి -దేవరపల్లి

సినీ నటుడు రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా అభిమానులు, జనసేన నాయకులు గొల్లగూడెంలోని వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కేకును కట్ చేసి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సువర్ణరాజు, రుద్ర శ్రీను, కవులూరి సత్తిబాబు, కాట్నం గణేష్, బాపిరాజు, గణపతి నాయుడు, దుర్గా ప్రసాద్, చప్పటి శివ, జాజిమొగ్గల శ్రీనివాస్, తాతబ్బాయి, అడబాల మణికంఠ, నిజంపూడి నాగరాజు, ఉన్నమట్ల రమేష్ పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో సర్వేయర్స్‌గా, టాలీ వర్కర్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులు బుధవారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే యూనియన్ ప్రతినిధి వర్గం ది కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులను కలిసేందుకు వెళ్లారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ ఆయన కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ మాట్లాడారు.

మాజీ సైనికునికి ఘన సన్మానం

ప్రజాశక్తి -దేవరపల్లి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మాజీ సైనికుడు నాయక్ కొయ్య అబ్బులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మానవత సంస్థలో తాను కూడా క్రియాశీలకంగా సేవలు అందిస్తానని, రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ సభ్యులు కూడా సేవా కార్యక్రమాలలో పాల్గొని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మానవత సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ నాయక్‌ను సన్మానించి మానవత షీల్డ్ అందించారు. ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు ఈడుపుగంటి నాగేశ్వరరావు, ఆచంట సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

జగన్ సేవల స్ఫూర్తితో రాజకీయాల్లోకి

ప్రజాశక్తి-తాళ్లపూడి



సాయి స్ఫూర్తి ఆసుపత్రి సిబ్బందితో శ్రీనివాస్

పేద మధ్యతరగతి ప్రజలకు అవసరమైన విద్యా వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న పథకాలను సేవలను చూసి ఆకర్షితుడై తాను రాజకీయాల్లోకి వచ్చానని వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తాళ్లపూడి వచ్చిన గూడూరి గ్రామంలోని సాయిస్ఫూర్తి ఆసుపత్రిని సందర్శించి సిబ్బందితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిఇఒ గుడా విజయరాజు సిబ్బంది శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్ పరిపాలన ఎందుకు అవసరమో వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనను, కొవ్వూరు ఎంఎల్‌ఎగా తలారి వెంకట్రావును గెలిపించాలని అభ్యర్థించారు. తాడిపూడి గ్రామ సర్పంచ్ నామా గోపాలం, గజ్జరం గ్రామ సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, నాయకులు నక్కా చిట్టిబాబు, యాళ్ల బాబూరావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, నాయకులు నరాలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



ప్రస్తుత 2023-34 రబీ సీజన్లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకూ మద్దతు ధర కలిపించే విధంగా, వారి నుంచి కొనుగోళ్లు చేపట్టడం కోసం సమన్వయం సాధించడంలో అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. బుధవారం వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందికి రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు విధానంపై సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ప్రస్తుత 2023-24 రబీ సీజన్లో జిల్లా పరిధిలో రైతులు పండించిన పంట ప్రతి గింజకూ మద్దతు ధర కలిపించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటను పొలం వద్ద నుంచి, కొనుగోలు కేంద్రాలకు, అక్కడ నుచి మిల్లర్ల వద్దకు తీసుకు వచ్చే క్రమంలో వివిధ దశల్లో చెయ్యవలసిన పనులు, అంశాలపై ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. రైతులకు, మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, అధికారుల ప్రమేయంతోనే ధాన్యం కొనుగోలు జరిగే విధంగా చూడాలని ఆమె అన్నారు. రైతులు కోతలు కోసి కుప్పలు వేసిన తరువాత ధాన్యాన్ని బస్తాలకు ఎత్తే సమయంలో వారికి గోనెసంచుల కొరత లేకుండా, హమాలీల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎన్ని గోనె సంచులు అవసరం అవుతాయో ముందుగానే వారి వద్ద నుండి డినామినేషన్ తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మిల్లుల వద్ద ఎటువంటి రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన పంట పొలం లోని కళ్లాల వద్ద నుంచి మిల్లర్ల వద్దకు వచ్చి వారికి మద్దతు ధర కల్పించేంత వరకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ రబీ సీజన్‌లో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్దేశించినట్టు చెప్పారు. ధాన్యం సేకరణ సమయంలో శాంపిల్స్, వాటి విశ్లేషణ, పాటించాల్సిన ప్రమాణాలు, తేమ శాతం, వ్యర్థాల శాతం, తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో సాంకేతిక పరమైన డేటా ఎంట్రీ, ట్రిప్ షీట్, తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రైతులు ధాన్యం అమ్మకానికి మిల్లర్ల వద్దకు తీసుకు వచ్చిన తరువాత మిల్లర్లతో ఎటువంటి సమస్యలూ లేకుండా అక్కడ ఉన్న అధికారులే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకు వచ్చిన తరువాత వారిని ఎక్కువ సమయం వేచి ఉండకుండా, వాటిని తిరిగి వెనుకకు పంపకుండా ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా జాగ్రత వహించాన్నారు. జిల్లాలో 231 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, పౌర సరఫరాల శాఖ డిఎం టి.రాధిక, డిఎస్ఒ పి.విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, మార్కెటింగ్ ఎడి ఎం.సునీల్ వినయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లోక్ సభ స్థానానికి ఏప్రిల్ 19న జరగనున్న ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి.వైధిలింగం బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న వైధిలింగంను కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో. ఆయన నామినేషన్ దాఖలు చేశారు. పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి, ఇతర నాయకులు ఆయన వెంట ఉన్నారు.

టిడిపి, జనసేన సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జనసేన పార్టీ నిడదవోలు నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ బుధవారం మండలంలోని చివటం, కె.సావరం, పాలంగి గ్రామాల్లో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. తొలుత శేషారావు మాట్లాడుతూ పొత్తులో భాగంగా తనకు ఎంఎల్‌ఎ అభ్యర్థిగా అవకాశం దక్కక పోవడంతో కార్యకర్తలు, అభిమానులు మనస్తాపం చెందినప్పటికీ అధినేత తీసుకున్న పొత్తు నిర్ణయాన్ని అంగీకరించి, పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కందుల దుర్గేష్‌ను గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భోగవల్లి ప్రసాద్, సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు.

'పెరవలిని అభివృద్ధి చేస్తా'

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి మండలాన్ని అభివృద్ధి చేస్తానని జనసేన పార్టీ నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావుతో కలిసి కడింపాడు, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పిట్లవేమవరంలో బుధవారం టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భోగవల్లి ప్రసాద్, అటికాల శ్రీను, పిప్పర రవి పాల్గొన్నారు.

ఆలయం వద్ద భారీ అన్నదానం

ప్రజాశక్తి-గోపాలపురం

లలితాంబిక అమ్మవారి ఆలయం వద్ద 15వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గోపాలపురం గ్రామంలోని ఉన్న లలితా అబిక అమ్మవారి ఆలయం 15వ వార్షికోత్సవ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లపూడి

పెరుగుతున్న ఎండ కారణంగా పాఠశాల విద్యార్థులకు స్కూళ్లు ముగిసే వారకూ వాత్సల్య మెడికల్ షాప్ యజమాని మల్లిపూడి చిన వెంకటేశ్వరరావు మజ్జిగ అందజేస్తున్నారు. ఆయనతో కలిసి రాగోలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ పాఠశాలలు జరిగే చివరి తేదీ వరకు రాగోలపల్లి పంచాయతీ పరిధిలోని రాగోలపల్లి, పోచవరం, తుపాకులగూడెం గ్రామాల్లో అన్ని పాఠశాలల విద్యార్థులకు మజ్జిగ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వరలక్ష్మి, ఆయా కుమారి తదితరులు పాల్గొన్నారు.